సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 1 । జూన్ । 2025



ప్రగతి రథం పల్లెకు దూరం

మాక్లూర్ మండలంలోని చాలా గ్రామాలకు సుమారు దశాబ్ద కాలంగా ఆర్టీసీ బస్సు రావడం లేదు.

- 8లో ▸



సమన్వయంతో..

బార్ అండ్ బెంచ్ మధ్య సమన్వయంతో దీర్ఘ కాలిక న్యాయవివాదాలను పరిష్కరించామని హైకోర్టు జడ్జి సుజన గుర్తు చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.1 /22.5

ఆకాశం మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పశువులను చట్టబద్ధంగా తరలించాలి

- సీపీ సాయి చైతన్య



రెంజల్(బోధన్): పశువుల రవాణా విషయంలో చట్టబద్ధత పాటించాలని జిల్లా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య పేర్కొన్నారు. మండలంలోని వారాంతపు పశువుల సంతను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నిబంధనల ప్రకారం పశువులను తరలించాలని సూచించారు. మొదట గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకొని సంతలో పాటిస్తున్న రికార్డులను పరిశీలించి, కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బక్రీద్ పండగతోపాటు ఆ తర్వాత కూడా పశువుల రవాణాలో పరిమితికి మించి తరలించకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులు నిర్ధారించిన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పండగ సందర్భంగా పాలిచ్చే ఆవులను వధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుశాఖతోపాటు పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డితో కలిసి వాహనాల్లో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పశువులను పరిశీలించారు. ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఉన్నారు.

ప్రజావాణి వాయిదా


నిజామాబాద్‌అర్బన్: ఈనెల 2న నిర్వహించాల్సిన ప్రజావాణిని రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

‘టాస్క్’లో ఉపాధి శిక్షణ


నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా ఉపాధి పొందాలని ప్రాంతీయ ముఖ్య అధికారి నవీన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్స్‌లో టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ ద్వారా ఉన్నత స్థాయి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు, పోటీ పరీక్షలకు అవసరమైన అర్థమెటిక్ లాజికల్ రీజనింగ్ పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జావా, డేటాబేస్, పైతాన్ వంటి ఆధునిక టెక్నాలజీపై శిక్షణ ఇస్తామని, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తామని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తిచేసిన ఆసక్తి గల అభ్యర్థులు రూ.599 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 70136 75052 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అదనపు కమాండెంట్‌కు పదోన్నతి

- కమాండెంట్‌గా బాధ్యతల స్వీకరణ



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పీ సత్యనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం అదే బెటాలియన్‌లో కమాండెంట్‌గా పదోన్నతి కల్పించింది. దీంతో శనివారం కమాండెంట్‌గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణను బెటాలియన్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పంటకు పాడి తోడైతే..

ఆరోగ్యకరమైన పాలు, పంట దిగుబడులు

- పంటకు సేంద్రియ ఎరువులు సైతం పాడి పశువులతోనే సాధ్యం
- సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయంలో పశుసంపదే కీలకం
- ముందు ఇంటికోసం.. ఆ తరువాత దేశం కోసం ‘పాడి–పంట’ లక్ష్యం కావాలి
- నేడు ప్రపంచ పాల దినోత్సవం నేపథ్యంలో జైతాపూర్‌లో సెమినార్



పశు సంపద.. పచ్చని పంటలు.. రైతన్నకు ఇంతకన్నా కావాల్సింది ఏముంటుంది. ముందు ఇంటి కోసం.. ఆ తరువాత దేశం కోసం ‘పాడి – పంట’ అనే ఆలోచనతో రైతన్న ముందుకు వెళ్తే ఆరోగ్యకర సమాజ నిర్మాణం నూటికి నూరుపాళ్లు సాధ్యమే! పంటకు పాడి తోడైతే సాగుకు అవసరమైన సేంద్రియ ఎరువు.. ప్రజలకు స్వచ్ఛమైన పాలు అందుబాటులో ఉన్నట్లే. నేడు ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

నేడు ప్రపంచ పాల దినోత్సవం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పాడిపంటలు సమృద్ధిగా ఉన్న ఇల్లు, గ్రామం, దేశం సిరిసంపదలతో తులతూగుతున్నాయి. అయితే పెరుగుతున్న జనాభా ఆహారభద్రత కోసం దిగుబడులను పెంచేందుకు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడంతో ప్రస్తుతం భూసారం దెబ్బతినడంతో పాటు విటమిన్స్ ఉన్న ఉత్పత్తుల బదులు కెమికల్స్ ఉన్న పంట ఉత్పత్తులనే తినాల్సిన దుస్థితి తలెత్తింది. దీంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఫలితంగా ఆస్పత్రుల సంఖ్య పెరుగుతోంది. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో పశువుల పేడను, జీవఎరువులను వదిలేయడంతో పశుపోషణ భారీగా తగ్గిపోయింది. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి సాగును ప్రోత్సహించేందుకు పలువురు పర్యావరణ అభిమానులు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. సుభాష్ పాలేకర్ ప్రతిపాదించిన గోకృపామృత ప్రకృతి సేద్యం అవలంబించే రైతుల సంఖ్య మెల్లగా పెరుగుతోంది. పాడి–పంట అనే నినాదంతో రైతులు వ్యవసాయం చేస్తే భూమాతకు, సమాజానికి ఎనలేని మేలు కలుగుతుందని సేంద్రియ సాగు చేస్తున్న పలువురు రైతులు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేస్తే నాణ్యమైన ఉత్పత్తులతో ఆరోగ్యంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీర్ఘకాలికంగా స్థిరమైన మేలు చేకూరుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతులు ‘మన ఇల్లు – మన ఊరు – మన మండలం – మన జిల్లా – మన రాష్ట్రం – మన దేశం’ అనే స్ఫూర్తితో సేంద్రియ వ్యవసాయం చేయాలని నినదిస్తున్నారు. మొదటగా రైతులు తమ వ్యవసాయ భూమిలో ఇంటికి సరిపోయేంత స్థలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ దశలవారీగా విస్తీర్ణాన్ని పెంచాలని వివరిస్తున్నారు.



విటమిన్స్ కాదు కెమికల్స్

ప్రస్తుతం అన్నదాతలు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడడంతో విటమిన్స్ బదులు కెమికల్స్ తినాల్సిన దుస్థితి నెలకొందని, అన్నదాతలు విషదాతలు కావొద్దని వ్యవసాయ, ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులు దేశీరకాలను ఎక్కువగా సాగు చేస్తే పోషకాలు అధికంగా ఉండే పంటలు పండుతాయని వివరిస్తున్నారు. యువత ప్రకృతి వ్యవసాయ రంగంలోకి రావాలని, ప్రస్తుతం రాష్ట్రంలో కూలీల కొరత ఎదురవుతున్న నేపథ్యంలో బీహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాల కూలీలు రావాల్సిన పరిస్థితి నెలకొందని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు అంటున్నారు.

పశుపోషణతో ప్రకృతి సాగుకు ఢోకా లేదు

పశు పేడ ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు. ఈ ఎరువులతో పంటలు సాగు చేస్తే భూసారం పెరిగి, పర్యావరణం, జీవవైవిధ్యం మరింత సమతుల్యంగా ఉంటుంది. పాడి–పంట అనే నినాదంతో రైతులు వ్యవసాయం చేస్తేనే ఈ దిశగా ఆరోగ్య భారతం తయారవుతుందని నిపుణులు అంటున్నారు. పురుగుమందులు, రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పశుపేడతో జీవామృతం, అగ్నేయాస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, గోకృపామృతాన్ని పశు పేడతో తయారు చేసుకోవచ్చని చెబుతున్నారు.

సండే స్పెషల్

ప్రకృతి వ్యవసాయానికి జైతాపూర్

జిల్లాలోని ఎడపల్లి మండలం జైతాపూర్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆదివారం (జూన్ 1న) ప్రపంచ పాల దినోత్సవం పురస్కరించుకుని జైతాపూర్‌లో యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (న్యూయార్క్) ఆధ్వర్యంలో జైతాపూర్‌లోని జెడ్పీ స్కూల్‌లో సెమినార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సెమినార్‌లో పశుపోషణ, నాణ్యమైన పాలు, ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించనున్నారు. గ్రామానికి చెందిన రైతులు పంటకు పాడిని తోడు చేసి అద్భుత ఫలితాలను సాధిస్తున్నారు.



సెమినార్ బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- నగర అభివృద్ధి, సుందరీకరణకు సమష్టిగా కృషి చేద్దాం
- డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపండి
- సమీక్షలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమనలను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తోపాటు ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే శనివారం సమీక్ష నిర్వహించారు. సీపీ, మున్సిపల్ కమిషనర్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పెద్ద నగరాల్లో నిజామాబాద్ కార్పొరేషన్ ఒకటని, నగర అభివృద్ధి, సుందరీకరణకు అందరం సమష్టి కృషితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. నగరంలో జనాభా పెరుగుతున్న క్రమంలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఫుట్‌పాత్ కబ్జాలు, సిగ్నల్ పాయింట్స్, వన్ వే రోడ్, పార్కింగ్ విషయాల్లో కఠిన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. నగరంలో గ్యాంగ్ రెచ్చిపోతున్నారని, వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా దుకాణాలు నడుపుతున్న వారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవడంపై ఎమ్మెల్యే అభినందించారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులో ఉంచాలి

- వాహనాలకు ప్రత్యేక వే బిల్లులు
- ఇసుక పక్కదారి పట్టొద్దు
- తహసీల్దార్లకు కలెక్టర్ హనుమంతు ఆదేశాలు జారీ



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌ గాంధీ హనుమంతు తహసీల్దార్లను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో, లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అన్నారు. లబ్ధిదారులకు ఇసుకను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేక వే బిల్లులను అందించాలని, ఇసుక పక్క దారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వర్షాలు ప్రారంభమైతే ఇసుక లభించే పరిస్థితి ఉండదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వానలు కురవకముందే సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్ధిదారులు ముందస్తుగా సమకూర్చుకునేందుకు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయనే ఫిర్యాదులు రాకూడదన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్లు , డీటీలు, ఆర్‌ఐలు తదితరులు

భూ భారతి సదస్సులు సమర్థవంతంగా..

ఈనెల 3వ తేదీ నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు సూచించారు. తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టంలోని నిబంధనలు, దరఖాస్తులను పరిశీలించాల్సిన తీరును వివరించారు. అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ గ్రామీణ విద్యార్థులకు అనుకూలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

జక్రాన్‌పల్లి: ఇచ్చిన మాట ప్రకారం జిల్లాకు నవోదయ, పసుపు బోర్డు తీసుకువచ్చిన ఘనత ఎంపీ అర్వింద్‌కు దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అన్నారు. నవోదయ మంజూరును హర్షిస్తూ మంలంలోని కలిగోట్‌లో శనివారం ఎంపీ అర్వింద్, ప్రధాని మోదీ చిత్రపటాలకు నాయకులతో కలిసి దినేశ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామమైన కలిగోట్ ప్రాంతంలో నవోదయ ఏర్పాటుతో ఈ ప్రాంతం విద్యాభివృద్ధికి నిలయంగా మారుతుందన్నారు. ఇక్కడ విద్యాలయం ఏర్పాటు అన్ని మండలాల విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. నవోదయ, పసుపు బోర్డు కార్యాలయం రూరల్ నియోజక వర్గంలో ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమన్నారు. అలాగే 44 నంబర్ జాతీయ రహదారిపై సర్వీసు రోడ్లు, ప్రధాన కూడళ్ల ఏర్పాటుకు ప్రధాని మోదీ నిధులు మంజూరు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, నాయకులు మహేందర్, శ్రీనివాస్‌గౌడ్, దత్తాద్రిగౌడ్, నాయిడి రాజన్న, ఆనంద్, శశాంక్, సతీశ్, కొరట్‌పల్లి నర్సయ్య, అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోదీ, అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దినేశ్ కులాచారి, నాయకులు

ధూమపానం మానసిక, శారీరక బానిసత్వం



ర్యాలీలో పాల్గొన్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: ధూమపానం అనేది అలవాటు కాదని, అది ఆరోగ్యాన్ని నాశనం చేసే మానసిక, శారీరక బానిసత్వమని డిప్యూటీ డీఎంహెచ్‌వోలు తుకారాం రాథోడ్, అంజనా అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలోని మాలపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వోలు మాట్లాడుతూ.. సిగరెట్, గుట్కా, బీడీ వంటివాటిలో నికోటిన్, టార్ వంటి విషపదార్థాలు ఉంటాయని, అవి ఊపిరితిత్తుల క్యాన్సర్, హార్ట్‌ఎటాక్, స్ట్రోక్, నోటి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయన్నారు. పాసివ్ స్మోకింగ్‌కు ధూమపానం అలవాటు లేని వారు సైతం బలవుతుంటారన్నారు. ‘నేను ధూమపానం మానుతాను – ఆరోగ్యంగా జీవిస్తాను’ అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎవైద్యులు సామ్రాట్‌యాదవ్, వెంకటేశ్, సహిస్తా ఫిర్దోస్, అఖ్తుస్నేసా బేగం, భార్గవి, అవంతి, మెడికోలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆస్పత్రిలో బాధలు పట్టేదెవరికి?

- జిల్లా ఆస్పత్రిలో వంద పడకలు.. 18 మంది వైద్యులు
- ఆర్థో కేసులొస్తే నిజామాబాద్‌కు వెళ్లాల్సిందే..
- మిగతా వైద్య సేవలన్నీ నామమాత్రమే



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో చెప్పుకునేందుకే 100 పడకలు ఉండగా వైద్యులు మాత్రం వేళ్ల మీద లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉన్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలందక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చికిత్స కోసం ప్రతిరోజూ పట్టణ ప్రజలతోపాటు బోధన్, సాలూర, రుద్రూర్, పోతంగల్, కోటగిరి, వర్ని, ఎడపల్లి, రెంజల్ మండలాలకు చెందిన వారు, పక్కరాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన వారు సైతం వస్తుంటారు. ప్రతి రోజూ 700 ఓపీ ఉంటుండగా, 30 నుంచి 40 మంది రోగులు ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారు. ఎమర్జెన్సీ కేసులు తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు వెళ్లాల్సిందే.

రెగ్యులర్ వైద్యులు ఆరుగురే..

ఆస్పత్రిలో మొత్తం 50 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 18 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో రెగ్యులర్ వైద్యులు ఆరుగురు కాగా, తాత్కాలిక ప్రాతిపదికన 11 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

49 మందే వైద్య సిబ్బంది

ఆస్పత్రిలో మొత్తం 74 మంది వైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 49 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో 37 మంది రెగ్యులర్ వారుకాగా, 12మంది తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్నారు.

తగ్గుతున్న ప్రసవాల సంఖ్య

పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో గడిచిన నాలుగు నెలలుగా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. మే నెలలో 65 కాన్పులు కాగా, ఇందులో 33 నార్మల్, 32 ఆపరేషన్లు ఉన్నాయి. గైనిక్‌లు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఏప్రిల్‌లో 20 మంది గర్భిణులను, మేలో 12 మందిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆస్పత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులు ఉండగా వారం రోజుల క్రితం నుంచి ఓ వైద్యురాలు విధులకు రావడం లేదు. ప్రస్తుతం ఆర్మూర్ నుంచి ఓ గైనకాలజిస్టును డిప్యూటేషన్‌పై పంపించారు.

వైద్యులు	పోస్టులు	అందుబాటులో ఉన్నది
సివిల్ సర్జన్‌లు	13	01
సివిల్ సర్జన్ ఆర్ఎంవో	02	01
డిప్యూటీ సివిల్ సర్జన్	09	00
సివిల్ అసిస్టెంట్ సర్జన్	27	05 రెగ్యులర్
(తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న వారు 11 మంది)		
సివిల్ సీనియర్ సర్జన్	01	00

“ ప్రతిపాదనలు పంపించాం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. చికిత్సల కోసం వచ్చే రోగులకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందిస్తున్నాం.

– రాహుల్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

జెన్‌కో, ఎస్సారెస్పీ అధికారుల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న జెన్‌కో, ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జెన్‌కో, ప్రాజెక్టు అధికారుల మధ్య శనివారం స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్ జరిగింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్‌లో ప్రాజెక్ట్ అధికారుల జట్టు విజయం సాధించగా, ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, జెన్‌కో డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆస్పత్రిలో విచారణ



వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలోని ప్రతిభ ఆస్పత్రిలో రోగి రాధిక మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజనాదేవి శనివారం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగి మృతిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగి ఆస్పత్రికి వచ్చినప్పుడు పరిస్థితి ఎలా ఉందని, సర్జరీ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆరా తీశారు. ఆస్పత్రిలో రోగికి చేసిన పరీక్షలను పరిశీలించారు. సర్జరీ సమయంలో వైద్యులు ఎలాంటి వైద్యం అందించారో పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. సర్జరీ చేసిన వైద్యుల అర్హత, ఎన్ని సంవత్సరాల అనుభవం తదితర వివరాలను తనిఖీ బృందం సభ్యులు క్షుణ్ణంగా ఆరా తీశారు. ప్రతిభ ఆస్పత్రిలో రోగి మృతి చెందిన ఘటనపై పూర్తి నివేదికను డీఎంహెచ్‌వోకు సమర్పిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనాదేవి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్, డీహెచ్‌ఈ వేణుగోపాల్, హెచ్‌ఈవో గోవర్ధన్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్



యోగాసనాలు వేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

నిజామాబాద్‌నాగారం: యాంత్రీకరణ జీవనంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలను శనివారం జీజీహెచ్‌లో జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జే గంగదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ఒత్తిడి, నిద్రలేమి, కోపం, డిప్రెషన్ తదితర వాటిని ఎలా నియంత్రించగలమో వివరించారు. అంతకుముందు యోగ శిక్షకులు ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో యోగా వైద్యులు డాక్టర్ తిరుపతి, ఆయుష్ ఫార్మాసిస్టులు పురుశోత్తం, ఉమ్మాప్రసాద్, నీరజ, యోగా శిక్షకులు విజయ భాస్కర్, రాజేందర్, నమ్రత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి రథం.. ఆ పల్లెలకు దూరం

- నేటికి ఆర్టీసీ బస్సుకు నోచుకోని పలు గ్రామాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నప్పటికీ మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ కాలినడకన నడిచి గమ్యానికి చేరుకుంటున్నారు.



మాక్లూర్ మండలం వల్లభాపూర్ గ్రామ ముఖచిత్రం



మాక్లూర్: గ్రామీణ ప్రాంత ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం సమీప పట్టణాలు, మండలాలకు వెళ్లాలంటే ఎక్కువగా ఆర్టీసీ బస్సునే ఆశ్రయిస్తారు. సురక్షిత ప్రయాణంతోపాటు ప్రైవేటు వాహనాలతో పోలిస్తే తక్కువ చార్జీలు.. అందుకే ఎక్కువగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణాలకు మొగ్గుచూపుతారు. కానీ, టీఎస్ ఆర్టీసీ మాత్రం పలు పల్లెలకు బస్సులు నడిపేందుకు మొగ్గు చూపడం లేదు.

పుష్కరకాలం నుంచి బస్సుల్లేవ్..

మాక్లూర్ మండలంలో చాలా గ్రామాలకు పుష్కరకాలం నుంచి బస్సులు నడవడం లేదు. దీంతో ప్రజలు ఐదారు కిలోమీటర్ల మేర కాలినడక వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో కాలినడక వెళ్లే మహిళలపై దుండగులు దాడులు చేసి గొలుసు చోరీలకు పాల్పడిన ఘటనలూ ఉన్నాయి. మండలంలోని వల్లభాపూర్, మెట్‌పల్లి, రాంపూర్, వెంకటాపూర్, గంగరమంద, డీకంపల్లి, అమ్రాద్‌తండా, సట్లాపూర్ తండాలకు పల్లె వెలుగు బస్సు కనిపించక ఏళ్లు గడిచాయి. లక్మాపూర్ గ్రామానికి ఇప్పటి వరకు బస్సు సౌకర్యం లేదు. ఇక ఉన్నత చదువుల కోసం వెళ్లే పట్టణాలకు వెళ్లే విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. చదువుకోవాలంటే కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా మండలంలోని చాలా గ్రామాలకు బీటీ రోడ్లు కూడా ఉన్నాయి. కానీ, ఆర్టీసీ బస్సు నడపకపోవడంలో అంతర్యమేమిటోనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు ఎక్కాలంటే నడవాల్సిన దూరం

గ్రామం	బస్సు ఎక్కే ప్రాంతం	కి.మీ
రాంపూర్	వేణు కిసాన్‌నగర్	7
వెంకటాపూర్	మెట్టు	5
మెట్‌పల్లి	జన్నెపల్లి	5
అమ్రాద్ తండా	అమ్రాద్	4
వల్లభాపూర్	జన్నెపల్లి	3
సట్లాపూర్ తండా	మదనపల్లి	3
మదన్‌పల్లి తండా	మదన్‌పల్లి	2
లక్మాపూర్	ఆంధ్రానగర్	3

బస్సు సౌకర్యం కల్పించాలి



మండలంలో బస్సు సౌకర్యం లేని పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు , పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకునేవారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలి.
– బి.నర్సయ్య(మెట్‌పల్లి), మాక్లూర్

పదేళ్ల నుంచి బస్సు రాలే..



మా గ్రామానికి బస్సు రాక పదేళ్లు అవుతుంది. మెరుగైన బీటీ రోడ్డు ఉంది. కా నీ బస్సు సౌకర్యం క ల్పించడం లేదు. బస్సు ఎక్కాలంటే నాలుగు కిలో మీటర్లు నడవాల్సిన పరిస్థితి.
– మూడా గోవింద్ నాయక్, అమ్రాద్ తండా, మాక్లూర్

సీనియారిటీ ప్రకారమే పదోన్నతులు కల్పించాలి



బ్యాంకు సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్యాక్స్ సీఈవోలు, ఉద్యోగులు

- ఎన్‌డీసీసీబీ సీఈవోకు సిబ్బంది వినతి

సుభాష్‌నగర్: ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, పీఆర్సీ వెంటనే ఇప్పించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె దయాసాగర్, దొంతుల నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్‌డీసీసీబీ చైర్మన్ అందుబాటులో లేకపోవడంతో సీఈవో నాగభూషణం వందేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో ఎంఎస్ 44 ప్రకారం డీఎల్‌ఈసీ ఫండ్ ద్వారా జీతాలు లేని అన్ని సంఘాలకు జీతాలు ఇచ్చి బదిలీలు చేపట్టాలన్నారు. సంఘ ఉద్యోగుల పదవీవిరమణ బెనిఫిట్స్ డీసీసీబీ ద్వారా ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు సొంత జిల్లాలో మాత్రమే బదిలీలు చేయాలని, 2019 తర్వాత నుంచి పనిచేస్తున్న వారికి కూడా జీవో ఎంఎస్ 44 అమలు చేయాలన్నారు. ఎన్‌డీసీసీబీ ఉద్యోగుల నియామకాల్లో సంఘ ఉద్యోగులతో 25 శాతం భర్తీ చేయాలన్నారు. సంఘ ఉద్యోగుల బదిలీలు కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఐడీ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఉద్యోగులు, సీఈవోలు బస్వంత్ రావు, విష్ణువర్ధన్, నాగరాజు, సుభాష్, మోహన్, ఉమ్మడి జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

దాబా హోటళ్లలో తనిఖీలు



దొంకేశ్వర్ దాబా హోటల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసు, అటవీ శాఖ అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): వన్యప్రాణుల మాంసాన్ని వండిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దాబా హోటళ్లలో పోలీసు, అటవీ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్రిడ్జ్‌లలో నిలువ ఉంచిన మాంసాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుందేళ్లు, నెమళ్లు, దుప్పిలు మొదలగు అటవీ జంతువులను వండకూడదన్నారు. వన్యప్రాణులను వేటాడినా, వాటికి హాని కలిగించినా శిక్షకు గురవుతారని తెలిపారు. బయటి వ్యక్తులు వేట మాంసాన్ని తీసుకువస్తే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఒకవేళ అలాంటి వారికి సహాయం చేస్తే నాన్ బెయిల్ కేసులు నమోదు చేస్తామని నోటీసులు అందజేశారు. తనిఖీల్లో డిప్యూటీ ఎఫ్ఆర్వో సుధాకర్, పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గుండెనెమ్లి గ్రామానికి చెందిన గడ్డి బాలబోయి(48) శుక్రవారం మంజీరలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం భార్య బందెవ్వ మంజీరకు వెళ్లి చూడగా బాలబోయి మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి చనిపోయినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు.

జీజీహెచ్‌లో గుర్తు తెలియని మహిళ..



మహిళ మృతదేహం

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్సై రఘుపతి శనివారం తెలిపారు. నగరంలోని దేవీరోడ్‌లో గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ 1 బ్లూకోల్ట్ సిబ్బంది ఆ మహిళను గురువారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మహిళ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి వయసు సుమారు 40 వరకు ఉంటుందని, వంకాయ కలర్ చీర, నీలి రంగు జాకెట్ ధరించి ఉందన్నారు. మహిళ సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్‌టౌన్‌లో సంప్రదించాలని సూచించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ పరిధిలోని లయన్స్ కంటి ఆస్పత్రి వెనుక ఉన్న దర్గా సమీపంలో పేకాటస్థావరంపై శనివారం దాడి చేసినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఐదుగురిని పట్టుకొని, వారి నుంచి రూ. 1,970 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

38 పశువుల పట్టివేత

భిక్కనూరు: అక్రమంగా తరలిస్తున్న 38 పశువులను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామం నుంచి 12 లేగదూడలు, 26 ఎడ్లను బొలెరో, డీసీఎం వ్యాన్‌లలో మెదక్ జిల్లా నార్సింగి గ్రామంలోని మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. పశువులను జంగంపల్లి శ్రీ క్రిష్ణ మందిరంలోని గోశాలకు తరలించామన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

కోనేరులో జారిపడి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రామారెడ్డి: ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన రామారెడ్డి మండలం మద్దికుంటలో శనివారం చోటు చేసుకుంది. ప్రొబెషనరీ ఎస్సై నవీన్‌చంద్ర తెలిపిన వివరాల ప్ర కారం.. మద్దికుంటకు చెందిన ఓరుగంటి గంగయ్య(50) తన భార్య 20 సంవత్సరాల క్రితం వెళ్లగా అప్పటి నుంచి ఒంటరిగా నివసిస్తున్నాడు. వృద్ధాప్యం కారణంగా ఇటీవలే మద్దికుంట వృద్ధాశ్రమానికి వచ్చాడు. బుగ్గ కోనేరులో శనివారం స్నానం చేసేందుకు వెళుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, భార్య ఓరుగంటి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై తెలిపారు.

చేపూర్‌లో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ శివారులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద కురాకుల మురళి(63) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన మురళి కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అప్పుడప్పుడు వీరబ్రహ్మేంద్రస్వామి గుడికి వస్తుంటాడు. శుక్రవారం రాత్రి సైతం గుడికి వస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన సంతోష్(37) ఆర్థిక ఇబ్బందులతో శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రొబెషనరీ ఎస్సై శైలిందర్ తెలిపారు. చంద్రశేఖర్ కాలనీ చెందిన సంతోష్‌కు అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కామారెడ్డిలో యువకుడు అదృశ్యం



సాహిత్ కుమార్

కామారెడ్డి క్రైం: నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కామారెడ్డిలో అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని గంగస్థాన్‌కు చెందిన వెంట్రామోల్ల సాహిత్ కుమార్ ప్రైవేటు కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం కామారెడ్డికి వచ్చిన సాహిత్ కుమార్ సాయంత్రం దేవునిపల్లి ప్రాంతంలో పోలీసులకు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అనంతరం స్నేహితుడు భరత్‌కుమార్ అతడిని బస్టాండ్‌కు తీసుకువచ్చి నిజామాబాద్ బస్సు ఎక్కించాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతోపాటు ఇంటికి చేరకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు శనివారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కత్తితో పొడుచుకొని ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గాజులపేట్ ప్రాంతంలో గురుద్వార్ వద్ద ఖాజా మొయినుద్దీన్(60) జీవితంపై విరక్తితో శనివారం రాత్రి తనకు తాను కత్తితో పొడుచుకున్నాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు. తక్షణమే స్పందించిన 108 ఈఎంటీ రాములు, పైలెట్ అజయ్‌ని స్థానికులు అభినందించారు.

మీకు తెలుసా?

బినోలాలో వాల్మీకి సమాధి



బినోలా గ్రామంలోని వాల్మీకి సమాధి

మానవజాతికి రామాయణ సందేశం బహుముఖం. దేశ కాలాతీతమైన, ప్రకాశవంతమైన కార్యసృష్టి చేసిన వాల్మీకి చరితార్థుడు. ఆ మహర్షి చివరి గడియలను మన జిల్లాలోనే గడిపారనే విషయం ఎంతమందికి తెలుసు. అందుకు సాక్ష్యమే నవీపేట మండలం బినోలా గ్రామంలోని సమాధి.

- గ్రామానికి ప్రారంభంలోనే చెరువు కట్ట పక్కన ఈ సమాధి ఉంది. సమాధికి వినియోగించిన రాళ్లపై రాతలు(లిపి) ఉన్నాయి.
- మహర్షిగా మారకముందు వాల్మీకి బినోలా శివారులోని గోదావరి పరీవాహక ప్రాంతంలో పక్షులను వేటాడేవారని, సప్తరుషులు ఒకరోజు ప్రత్యక్షమై ఆయనకు హితబోధ చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి.
- అప్పటి నుంచి మహర్షిగా మారి ఇదే ప్రాంతంలో శిష్యులకు బోధనలు చేశారు. గోదావరిలో స్నానమాచరించి గ్రామంలోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేసేవారు.
- పవిత్ర కాశీలో ఉన్న ఆలయాలు.. బినోలాలో కూడా ఉన్నట్లు వేద పండితులు చెబుతారు.

– నవీపేట్

సమన్వయంతో న్యాయవివాదాల పరిష్కారం

- జిల్లాలో పర్యటించిన హైకోర్టు జడ్జి సుజన



హైకోర్టు జడ్జి సుజన దంపతులను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు



హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న సీపీ

నిజామాబాద్ లీగల్: జిల్లాలో పనిచేసిన కాలంలో బార్ అండ్ బెంచ్ మధ్య సమన్వయంతో దీర్ఘకాలిక న్యాయవివాదాలను పరిష్కరించుకున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి సుజన గుర్తుచేశారు. శనివారం నిజామాబాద్ నగరానికి వచ్చిన ఆమెకు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల సాయరెడ్డి, మాణిక్ రాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తించిన కాలపు స్మృతులను ఆమె నెమరు వేసుకున్నారు. అనంతరం బార్ అధ్యక్షుడు సాయరెడ్డి మాట్లాడుతూ జిల్లా న్యాయవ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలని జస్టిస్ సుజనను కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీ రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు, బార్ కార్యవర్గ సభ్యులు ఆకుల రమేశ్, టక్కర్ హన్మంత్ రెడ్డి, నీలకంఠ రావు, గడుగు గంగాధర్, పిట్లం శ్రీనివాస్, వీ భాస్కర్, జే వెంకటేశ్వర్, మాజీ పీపీ మధుసూదన్ రావు, ఆశ నారాయణ, శ్రీనివాస్ గౌడ్, శ్రీమాన్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో పూజలు

జస్టిస్ సుజన శంకర్ దంపతులు, కుమారులతో కలిసి నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, సుభాష్ నగర్ శ్రీరామాలయం, సారంగపూర్ హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా జడ్జిగా విధులు నిర్వహించిన సమయంలో మొక్కుకున్న మొక్కులు తీర్చుకున్నట్లు ఆమె తెలిపారు.

హైకోర్టు జడ్జిని కలిసిన సీపీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు వచ్చిన హైకోర్టు జడ్జి కే సుజనను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు.

కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం

అభినందించిన కలెక్టర్



రక్తదానం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రారంభించగా, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులతోపాటు వివిధ శాఖలకు చెందిన సుమారు 60 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తలసేమియా పేషెంట్ల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తదానం ఉపకరిస్తుందని గుర్తుచేశారు. రక్తదానం చేసిన ఉద్యోగులకు రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరఫున ప్రశంసాపత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, అసోసియేషన్ ప్రతినిధులు మహేశ్, శ్రీనివాస్, రెడ్‌క్రాస్ బాధ్యులు బుస్స ఆంజనేయులు, తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ కళాశాలకు అటానమస్



కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా వచ్చినట్లు పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎస్ఎస్ఆర్ యాజమాన్యం

నిజామాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు యూజీసీ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మారయ్య గౌడ్ తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియాతో ఆయన మాట్లాడారు. 33 సంవత్సరాలుగా జిల్లాలో ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల కొనసాగుతోందని, 2025–26 విద్యా సంవత్సరం నుంచి కళాశాలకు నూతనంగా యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ స్వయం ప్రతిపత్తి హోదాను కల్పించిందన్నారు. ఈ గుర్తింపుతో కళాశాల విద్యా ప్రాముఖ్యత, సృజనాత్మకత సమగ్ర విద్య అభివృద్ధి దిశగా ఓ మైలురాయి చేరుకున్నట్లు తెలిపారు. స్వయం ప్రతిపత్తితో కళాశాలకు సొంత పాఠ్య ప్రణాళిక రూపొందించుకోవడం, కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంతోపాటు ఆధునిక విద్య అవసరాలు, పరిశ్రమ అవసరాలను ప్రతిబింబించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని వివరించారు. స్వయంగా పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం చేసే అవకాశం ఉందన్నారు. స్వయం ప్రతిపత్తి హోదా లభించడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రత్యేక హోదాకు కృషి చేసిన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ హరిత గౌడ్, హర్షిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో శనివారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 7,840 మంది విద్యార్థులకు గానూ 7,234 మంది హాజరు కాగా 606 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నగరంలోని సీఎస్ఐ డిగ్రీ కాలేజీలో ఒకరు డిబార్ అయినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు తీపి కబురు

- టీచర్లు, ఆయాల ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంపు

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఉద్యోగ విరమణ వయసుతోపాటు బెనిఫిట్స్ పెంచుతూ శనివారం జీవో జారీ చేసింది. గతంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఉద్యోగ విమరణ ఉండేది కాదు. ఏడాది క్రితం ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఉద్యోగ విరమణ వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లు చేయడంతోపాటు బెనిఫిట్స్ కింద అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష ఉండగా దానిని రూ.2 లక్షలకు, ఆయాలకు రూ. 50 వేలు ఉండగా రూ.లక్షకు పెంచింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో సుమారు 100కు పైగా టీచర్లు, 80కి పైగా ఆయాలకు ప్రయోజనం చేకూరనుంది. కాగా, 60 ఏళ్లు దాటిన తర్వాత వీఆర్ఎస్ తీసుకునే అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయనుంది.

మంచి నిర్ణయం

ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. మా డిమాండ్లు అంగీకరించి న్యాయం చేసింది. వయస్సు రీత్యా రిటైర్‌మెంట్ గడువు పెంచడం సమంజసమే. ఇప్పటి వరకు రిటైర్ అయిన వారికి ప్రభుత్వం ప్రకటించిన బెనిఫిట్స్ ఇవ్వాలి.
– పెద్దింటి స్వర్ణ, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి